సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం । 7 । ఏప్రిల్ । 2023



నిందితుల అరెస్ట్
బొద్దనపల్లిలోని మామిడి తోటలో జరిగిన హత్య కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు.
8లో ▸



ప్రమాదాల 'రహదారి'
జాతీయ రహదారి నిర్వహణ పేరుతో సిబ్బంది అవలంబిస్తున్న విధానాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి.
8లో ▸

వంగడాలకు మారుపేరు
వరి పంటపై వినూత్న ప్రయోగాలు చేస్తూ మార్టేరు వ్యవసాయ పరిశోధనా కేంద్రం పేర్గాంచింది. వంగడాల పరిశోధనలపై ఇక్కడ శాస్త్రవేత్తల కృషి ప్రశంసనీయం.

8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శుక్రవారం సాయంత్రం)	సహరి (శనివారం వేకువజాము)
భీమవరం	6.25	4.33
తాడేపల్లిగూడెం	6.27	4.41
నరసాపురం	6.24	4.32

న్యూస్‌రీల్

నిట్‌లో క్రీడోత్సవం


బహుమతులు సాధించిన విద్యార్థులు

తాడేపల్లిగూడెం: విద్యార్థుల్లో అపార శక్తి సామర్థ్యాలు దాగి ఉంటాయని, వాటిని వెలికి తీసి సద్వినియోగం చేసుకోవాలని నాగపూర్ నిట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్యులు డాక్టర్ ఎఫ్.రాబిన్ సైమన్ అన్నారు. తాడేపల్లిగూడెంలోని ఏపీ నిట్‌లో గురువారం జరిగిన వార్షిక క్రీడోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నైపుణ్యాలను పెంచుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. మానవ వనరులే దేశాన్ని ప్రగతిపథంలో నడిపిస్తాయని, విద్యార్థుల భాగస్వామ్యం కీలకమన్నారు. విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని, ఈ దిశగా ప్రభుత్వాలు క్రీడలను ప్రోత్సహిస్తున్నాయన్నారు. సాస్ ఫ్యాకల్టీ ఇన్‌చార్జి డాక్టర్ కిరణ్ తీపర్తి, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ వీరేష్‌కుమార్, డీన్‌లు జీఆర్‌కె.శాస్త్రి, టి.కురుమయ్య, ఎస్.జయరామ్, ఆచార్యులు వి.సందీప్,రాముడు, వినోత్‌కుమార్‌రాజా, అరుణ్‌కుమార్, సంతోష్, కృష్ణమూర్తి, తపస్, రేష్మా, శ్రీనివాసరావు, సంధ్యారాణి పాల్గొన్నారు.

98.65 శాతం విద్యార్థుల హాజరు

సాక్షి, భీమవరం: జిల్లావ్యాప్తంగా గురువారం నిర్వహించిన పదో తరగతి హిందీ పరీక్షకు 98.65 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ తెలిపారు. 20,789 మంది విద్యార్థులకు 20,509 మంది హాజరయ్యారన్నారు. 32 పరీక్షా కేంద్రాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్, ఆరు కేంద్రాల్లో సమగ్రశిక్ష అడిషినల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్, మూడు కేంద్రాల్లో ప్రభుత్వ పరీక్షల కమిషనర్, నాలుగు కేంద్రాల్లో జిల్లాస్థాయి పరిశీలకులు, ఆరు కేంద్రాలల్లో తాను తనిఖీ చేశామన్నారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని చెప్పారు.

అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటుకు ఉత్తర్వులు

భీమవరం(ప్రకాశం చౌక్): 2023, 2024 రెండేళ్ల కాలానికి నూతన అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని కలెక్టర్, అక్రిడిటేషన్ కమిటీ చైర్‌పర్సన్ పి.ప్రశాంతి ఓ ప్రకటనలో తెలిపారు. మహిళా జర్నలిస్టులకు ప్రాధాన్యమిస్తూ కమిటీలో సభ్యులుగా చేర్చేందుకు సూచించారని పేర్కొన్నారు. అర్హులైన మహిళా జర్నలిస్టులను అక్రిడిటేషన్ కమిటీలో సభ్యులుగా చేర్చేందుకు దరఖాస్తులు కోరుతున్నామని, ఈనెల 10వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు భీమవరం కలెక్టరేట్ ప్రాంగణంలోని డీపీఆర్‌ఓ కార్యాలయానికి దరఖాస్తులు పంపాలని కోరారు. మరిన్ని వివరాలకు అక్రిడిటేషన్ కమిటీ మెంబర్ కన్వీనర్‌ను సెల్ 9121215278లో సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): దేశంలోని ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ మెయిన్స్ రెండో సెషన్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఏలూరు జిల్లాకు సంబంధించి ఏలూరులోని సిద్ధార్థ క్వెస్ట్ పాఠశాలలో, పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి తాడేపల్లిగూడెం వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. పరీక్షలకు ఏలూరులో ఉదయం 101 మందికి 94 మంది, మధ్యాహ్నం 101 మందికి 95 మంది, తాడేపల్లిగూడెంలో ఉదయం 120 మందికి 117 మంది, మధ్యాహ్నం 120 మందికి 118 మంది హాజరయ్యారు. ఏలూరు సిటీ కో-ఆర్డినేటర్‌గా వైఎస్ఎస్ చంద్రశేఖర్ వ్యవహరించారు.

కొనసాగిన దూరవిద్య పరీక్షలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో టెన్త్, ఇంటర్మీడియెట్ పరీక్షలు గురువారం కొనసాగాయి. 10వ తరగతి హిందీ పరీక్షకు నలుగురు విద్యార్థులకు ముగ్గురు, ఇంటర్ వాణిజ్య/వ్యాపార శాస్త్రం పరీక్షకు 768 మందికి 714 మంది, జీవ శాస్త్రం పరీక్షకు 383 మందికి గాను 352 మంది హాజరయ్యారు. జిల్లాలో నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, హై పవర్ కమిటీ, డీఈసీ కమిటీలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశాయని, పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఏలూరు డీఈఓ ఎస్‌వీ రవిసాగర్ తెలిపారు.

వైద్యం.. అధునాతనం

ఆరోగ్యానికి భరోసా
- ప్రభుత్వాస్పత్రుల్లో ఆధునిక వైద్య పరికరాలు
- అందుబాటులో 89 రకాల వైద్యసేవలు
- రోజుకు 700 మందికి ఆరోగ్య పరీక్షలు
- జిల్లాలోని ఎనిమిది ఆస్పత్రుల్లో అధునాతన సౌకర్యాలు

జిల్లా ఆస్పత్రి	తణుకు
ఏరియా ఆస్పత్రులు	భీమవరం, పాలకొల్లు, నరసాపురం, తాడేపల్లిగూడెం
కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు	పెనుగొండ, ఆకివీడు, ఆకివీడు

ప్రభుత్వాస్పత్రుల్లో ఇలా..

పరికరాలు	సంఖ్య
వెంటిలేటర్స్	140
ఆక్సిజన్ కాన్సెన్‌ట్రేటర్	362
ఈసీజీ మెషీన్	6
సీటీజీ మెషీన్	6
యూఎస్‌జీ మెషీన్	8
ఎక్స్‌రే	7
ట్రాన్స్‌పోర్ట్ వెంటిలేటర్స్	2
బయోకెమిస్ట్రీ అనలైజర్స్	8
బైనోక్యులర్ మైక్రోస్కోప్	8
ఆటోక్లేవ్	7
ఎలక్ట్రోలైట్ అనలైజర్	9
యూఎస్‌జీ మెషీన్	8
ఫొటోథెరపీ యూనిట్	9
పీహెచ్ మీటర్స్	25
బ్లడ్ బ్యాంక్ ఫ్రిజ్‌లు	11


భీమవరం ప్రభుత్వాస్పత్రిలో గర్భిణికి స్కానింగ్ చేస్తున్న వైద్యురాలు


తణుకులో డిజిటల్ ఎక్స్‌రే మెషీన్

భీమవరం(ప్రకాశం చౌక్): పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యసేవలను అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నాడు-నేడులో ప్రభుత్వాస్పత్రుల రూపురేఖలు మార్చివేసింది. ఆస్పత్రులకు నూతన భవనాల నిర్మించడంతో పాటు పూర్తిస్థాయిలో వైద్యపరికరాలను సమకూర్చింది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన మెషీన్లు, పరికరాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. కేవలం కార్పొరేట్ ఆస్పత్రులకే పరిమితమైన పలురకాల సేవలను సర్కారు ఆస్పత్రుల్లో పేదలకు అందిస్తోంది. ఆధునిక వైద్య సేవలతో పాటు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు.

ఎక్స్‌రే నుంచి వెంటిలేటర్ వరకూ..
జిల్లాలో జిల్లా, ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు ప్రభుత్వం అధునాతన పరికరాలు అందించింది. ఆయా ఆస్పత్రుల సామర్థ్యాన్ని బట్టి పరికరాలను కేటాయించింది. ఎక్స్‌రే, స్కానింగ్, ఈసీజీ, వెంటిలేటర్, ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్స్, రక్తపరీక్షల పరికరాల వంటివి సుమారు 89 రకాలు అందజేసింది. గతంలో ఆక్సిజన్ మెషీన్లు మాత్రమే ఉండగా ఇప్పుడు వెంటిలేటర్, అల్ట్రాసౌండ్ స్కానింగ్ సౌకర్యం స్థాయికి ప్రభుత్వాస్పత్రులు అభివృద్ధి చెందాయి.

గతంలో అరకొరగా..
గతంలో ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులు, సౌకర్యాలు కొరత ఉండటంతో పేదలు వైద్యసేవలకు ఇబ్బంది పడేవారు. వైద్యులు సూచించిన ఆరోగ్య పరీక్షలను కూడా ప్రైవేట్ ల్యాబ్‌ల్లో చేయించుకోవాల్సి వచ్చేది. వీటికోసం వేలాది రూపాయలు వెచ్చించాల్సి ఉండేది. అయితే ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారింది. వైద్యులు సూచించిన అన్ని పరీక్షలు ప్రభుత్వాస్పత్రుల్లోనే ఉచితంగా చేస్తుండటంతో పేదలకు ఇబ్బందులు తప్పాయి.

రోజుకు 2 వేల మందికి..
జిల్లాలోని 8 ప్రభుత్వాస్పత్రుల్లో రోజుకు సుమారు 2 వేల మంది వైద్య సేవలు పొందుతున్నారు. అలాగే 700 మంది వరకూ వైద్య పరీక్షలు చేస్తున్నారు. రక్త పరీక్షలు, స్కానింగ్, ఎక్స్‌రే, ఈసీజీ తదితర పరీక్షలు నిర్వహిస్తున్నారు. గతంలో రోజుకు 800 మంది వరకు ఆరోగ్య, 100 మంది వరకు వైద్య పరీక్షల సేవలు పొందేవారు. ఇప్పుడు ప్రభుత్వాస్పత్రుల్లో పూర్తిస్థాయిలో వైద్య పరికరాలు అందుబాటులో ఉండటంతో సేవలు పొందే వారి సంఖ్య పెరిగింది.

ఉచితంగా స్కానింగ్



నేను భీమవరం ప్రభుత్వాస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్నాను. ఉచితంగా స్కానింగ్ పరీక్షలు చేస్తున్నారు. బయట స్కానింగ్ చేయించుకోవాలంటే రూ.2 వేల వరకూ ఖర్చవుతుంది. ఇక్కడ గైనకాలజిస్ట్ డాక్టర్ ఉచితంగా వైద్య పరీక్షలతో పాటు స్కానింగ్ చేయడం సంతోషంగా ఉంది.
– బి.వరహాలు, గర్భిణి, భీమవరం

పూర్తిస్థాయిలో పరికరాలు



జిల్లాలోని 8 ప్రభుత్వాస్పత్రుల్లో పూర్తిస్థాయిలో వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ఆయా ఆస్పత్రుల వైద్య సేవల సామర్థ్యాన్ని బట్టి ప్రభుత్వం ఆధునిక పరిజ్ఞానంతో కూడిన పరికరాలు అందించింది. వెంటిలేటర్, ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్, అత్యాధునిక టెక్నాలజీ కలిగిన ఎక్స్‌రే, ఈసీజీ మెషీన్లు వంటివి ఉన్నాయి.
– ఎం.వీరాస్వామి, డీసీహెచ్ఎస్, భీమవరం

రూ.3.61 కోట్లకు ఫెర్రీ వేలం


నరసాపురంలో వేలం నిర్వహిస్తున్న అధికారులు

నరసాపురం రూరల్: నరసాపురం మండలపరిషత్ ఆధీనంలోని నరసాపురం-మాధవాయిపాలెం రేవు వేలం పాట రూ.3.61 కోట్లకు ఖరారైంది. గురువారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో సీల్డ్‌కమ్ బహిరంగ పద్ధతిలో వేలం నిర్వహించారు. నలుగురు పాల్గొనగా ముమ్మిడివరానికి చెందిన పాటదారుడు బహిరంగ వేలంలో రూ.2,61,01,100కు పాట పాడారు. అయితే ముందుగా సీల్డు టెండర్లను అధికారులు స్వీకరించారు. బహిరంగ పాట అనంతరం సీల్డ్ టెండర్లను తెరవగా వైఎస్సార్ సీపీ బ్రాహ్మణ సంఘ నాయకుడు చక్రావధానుల చినరెడ్డప్ప ధవేజీ రూ.3.61 కోట్లకు టెండరు దాఖలు చేసి హెచ్చుపాటదారుడిగా నిలిచారు. గత ఆర్థిక సంవత్సరం కంటే రేవు పాట రూ.81 లక్షలు అధికంగా వెళ్లడం విశేషం. గత నెలలో ఫెర్రీ వేలం నిర్వహించగా పాటదారులు కుమ్మక్కై ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టేందుకు ప్రయత్నించడం, సీల్డ్ టెండర్లు దాఖలు చేసేందుకు ముందుకు రాకపోవడంతో పాటను వాయిదా వేసిన విషయం తెలిసిందే. హెచ్చుపాటదారుని వివరాలను ఉన్నతాధికారులకు నివేదించి పాటను ఖరారు చేస్తామని ఎంపీడీఓ తెలిపారు. నరసాపురం, సఖినేటిపల్లి ఎంపీపీలు మైలాబత్తుల సోనీ, మల్లికార్జునరావు, జెడ్పీటీసీలు బొక్కా రాధాకృష్ణ, అన్నపూర్ణ, జేఏసీ సభ్యులు దొంగ మురళీకృష్ణ పాల్గొన్నారు.

శ్రీయాన్ష్ సాహసం అభినందనీయం




శ్రీయాన్ష్‌ను అభినందిస్తున్న మంత్రి కారుమూరి, చిత్రంలో జేసీ మురళి, శ్రీయాన్ష్ లింబో స్కేటింగ్ ప్రదర్శన

తణుకు అర్బన్: స్కేటింగ్ ప్రదర్శనలో ప్రపంచ రికార్డు సాధించిన చిన్నారి శ్రీయాన్ష్ చూపిన సాహసం అద్భుతమని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపల్ స్కేటింగ్ కోర్టులో గురువారం రాత్రి నాలుగేళ్ల బాలుడు కాటూరి శ్రీయాన్ష్ లక్ష్మణ అభిరామ్ లింబో స్కేటింగ్ అండర్ ఫైర్ అండ్ గ్లాస్ పీసెస్ బార్స్ ప్రదర్శన కార్యక్రమానికి మంత్రి కారుమూరి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ చిరుప్రాయంలోనే సాహసోపేత క్రీడలను ఎంచుకోవడం శుభపరిణామమన్నారు. జాయింట్ కలెక్టర్ జేవీ మురళి మాట్లాడుతూ శ్రీయాన్ష్‌ను ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.

శ్రీయాన్ష్ ప్రపంచ రికార్డు
వజ్ర రికార్డ్స్, గ్లోబల్ రికార్డ్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 15 సెంటీమీటర్ల ఎత్తు, 40 మీటర్ల పొడవున సున్నా ఆకారంలో ఏర్పాటుచేసిన బార్స్ పైన అగ్నికీలలు, కింద గాజు పెంకుల మధ్య స్కేటింగ్ ప్రదర్శనతో చిన్నారి శ్రీయాన్ష్ ఆకట్టుకున్నాడు. ఈ సందర్భంగా వజ్ర రికార్డ్స్ సీఈఓ తిరుపతిరావు, గ్లోబల్ రికార్డ్స్ సీఈఓ మురుగానందం చిన్నారిని సత్కరించి ట్రోఫీ, మెడల్స్ అందజేశారు. తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్, తానేటి వీరయ్య, తాటిపర్తి వాసు, కోచ్ లావణ్య, బాలుడి తాతయ్య కాటూరి లక్ష్మణరావు, తల్లితండ్రులు కాటూరి రామప్రసాద్, శ్రీప్రభచంద్ర పాల్గొన్నారు.

పేదల వైద్యానికి అధిక ప్రాధాన్యం

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ


జగన్నాథపురంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: పేదల ఆరోగ్యానికి, వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని, నాడు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ప్రవేశపెడితే.. ఆయన తనయుడు సీఎం జగన్ ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమలులోకి తీసుకువచ్చారని ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. గురువారం జగన్నాథపురం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ 2007లో వైఎస్సార్ ఆరోగ్యశ్రీని ప్రవేశపెట్టారని, ఆయన బాటలోనే సీఎం జగన్ ప్రజల ఆరోగ్య సంరక్షణకు పాటుపడుతున్నారన్నారు. పాడి పశువులకు సైతం మొబైల్ పశువైద్యశాలల ద్వారా వైద్యం అందించడం అభినందనీయమన్నారు. అలాగే మహిళల ఆర్థికాభివృద్ధికి పథకాల ద్వారా తోడ్పాటు, చిన్నారుల విద్యాభివృద్ధికి అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెనలతో కృషిచేస్తున్నారన్నారు. నాడు-నేడుతో ఆస్పత్రులు, పాఠశాలలు అభివృద్ధి చేశారని, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఇంటికే వైద్యసేవలను అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. ఇంత చేస్తున్నా ప్రతిపక్షాలు తమ పత్రికల ద్వారా తప్పుడు ప్రచారాలు, తప్పుడు రాతలు రాయిస్తున్నాయన్నారు. రాజకీయ పరిణతి లేని వ్యక్తి పవన్ కల్యాణ్ అని, చంద్రబాబును గద్దెనెక్కించేందుకు చూస్తున్నారని విమర్శించారు. ప్రస్తుతం ఉన్న పథకాలు భవిష్యత్‌లో కూడా కొనసాగాలంటే జగన్‌ను మరలా ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీలు పొనుకుమాటి శేషులత, దాసరి హైమావతి, సర్పంచ్ ఉంద్రాజవరపు చంద్రిక, వైస్ ఎంపీపీలు సూర్పని రామకృష్ణ, కట్టా రంగబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్, వెలిశెట్టి నరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీకా వికటించిందంటూ తల్లిదండ్రుల ఆందోళన


మృతి చెందిన చిన్నారి

ఏలూరు టౌన్: టీకా వికటించి తమ బిడ్డ మృతిచెందాడంటూ తల్లిదండ్రులు ఏలూరు జిల్లా ప్రభుత్వ బోధనాస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపడతామని డీఎంహెచ్ఎంఓ ఆశ హామీ ఇవ్వడంతో శాంతించారు. వివరాలిలా ఉన్నాయి. గుండుగొలనుకి చెందిన చవల అంజలిదేవి తన 45 రోజుల మగ శిశువుకు బుధవారం గుండుగొలను పూలవీధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో టీకా వేయించింది. అక్కడి వైద్య సిబ్బంది ఒక వెయిల్‌లో ఐదుగురు చిన్నారులకు టీకా వేశారు. టీకా వేసిన తర్వాత అంజలిదేవి పసిబిడ్డను ఇంటికి తీసుకువెళ్లి పాలు పట్టించింది. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న బిడ్డను గుండుగొలను పీహెచ్‌సీకి తీసుకువెళ్లగా ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో ఏలూరు ప్రభుత్వ బోధనాస్పత్రికి తరలించారు. ఇక్కడ పిల్లల వైద్యులు శిశువును పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఊపిరితిత్తుల్లోనికి పాలు వెళ్లడంతో శ్వాస తీసుకోవడంలో అడ్డంకులు ఏర్పడి శిశువు మరణించి ఉండవచ్చని వైద్యులు చెబుతున్నారు. వెయిల్‌లో టీకా తీసుకున్న మిగిలిన నలుగురు చిన్నారులూ ఆరోగ్యంగానే ఉన్నారని, అంజలిదేవి బిడ్డ మృతికి టీకా కారణం కాదని వైద్యులు అంటున్నారు.

సంపూర్ణ ఆరోగ్యమే 'ఫ్యామిలీ డాక్టర్' లక్ష్యం

కలెక్టర్ ప్రశాంతి


ఫ్యామిలీ డాక్టర్ ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి, చిత్రంలో ఎమ్మెల్యే శ్రీనివాస్

భీమవరం అర్బన్: పేదలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడమే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం లక్ష్యమని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మండలంలోని తాడేరు గ్రామ సచివాలయం వద్ద గురువారం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌తో కలిసి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోగి ఇంటి వద్దకే వైద్యులు వెళ్లి సేవలందిస్తారన్నారు. పీహెచ్‌సీలో ఉన్న ఇద్దరు వైద్యులతో పాటు ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు చేస్తారన్నారు. వైద్యుల బృందం పర్యటనకు ముందే గ్రామస్తులకు సమాచారం అందిస్తామన్నారు. కుటుంబంలో దీర్ఘకాలిక వ్యాధులతో ఎవరైనా బాధపడుతుంటే వారసత్వంగా మిగిలిన వారికి రాకుండా జాగ్రత్తలు తీసుకునేందుకు ఫ్యామిలీ డాక్టర్ దోహదపడుతుందన్నారు. గ్రామాల్లో మరింత మెరుగైన వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని తీసుకువచ్చారన్నారు. కార్యక్రమాన్ని సక్రమంగా అమలు చేయాలని వైద్యులు, అధికారులు, సిబ్బందికి కలెక్టర్ సూచించారు.

వైద్యాన్ని బలోపేతం చేసేలా..
భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ పాలన వికేంద్రీకరణలో భాగంగా ప్రభుత్వం సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చిందన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో పథకాలు అమలు చేస్తోందన్నారు. అలాగే రాష్ట్ర ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో గ్రామీణ స్థాయిలో వైద్యసేవలను బలోపేతం చేసేలా ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని తీసుకువచ్చారన్నారు. అలాగే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, 108, 104 వాహన సేవలను బలోపేతం చేశారన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా కూడా పేదల వైద్యానికి సాయమందిస్తున్నారన్నారు. అనంతరం 104 వాహనాన్ని కలెక్టర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఎంపీపీ పేరిచర్ల విజయనరసింహరాజు, జెడ్పీటీసీ సభ్యుడు కాండ్రేగుల నరసింహారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, అదనపు జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ భానునాయక్, తహసీల్దార్ వై.రవికుమార్, మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ, పీహెచ్‌సీ వైద్యాధికారి సుగుణరాజు, డాక్టర్ అరుణకుమారి, పి.సత్యనారాయణరాజు, మండల జేసీఎస్ కన్వీనర్ కోమటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జాయింట్ కలెక్టర్ల బదిలీ


జేవీ మురళి


పి.అరుణ్‌బాబు


రామసుందరరెడ్డి

భీమవరం(ప్రకాశం చౌక్): రాష్ట్రంలో జరిగిన ఐఏఎస్‌ల బదిలీల్లో భాగంగా ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల జాయింట్ కలెక్టర్లకు స్థానచలనం కలిగింది. ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు సత్యసాయి జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఏలూరు జాయింట్ కలెక్టర్‌గా ఎంప్లాయిమెంట్ అండ్ ట్రెనింగ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న బి.లావణ్యవేణిని నియమించారు. పశ్చిమగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ జేవీ వెంకటమురళి ట్రైబల్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర రెడ్డిని పశ్చిమగోదావరి జిల్లా జేసీగా నియమించారు.

10 నుంచి సీజీఆర్ఎఫ్ సదస్సులు

దొండపర్తి (విశాఖ దక్షిణ): ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు సర్కిళ్లలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సదస్సులు నిర్వహిస్తున్నట్లు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) చైర్మన్, విశ్రాంత జడ్జి బి.సత్యనారాయణ వెల్లడించారు. 27న రాజమహేంద్రవరం కోరుకొండ సబ్ డివిజన్‌లో, 28న ఏలూరులో గోపాలపురం సబ్ డివిజన్ కార్యాలయంలో సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరిగే సదస్సుల్లో వినియోగదారులు నేరుగా పాల్గొని విద్యుత్ సంబంధిత సమస్యలపై కమిటీకి ఫిర్యాదులు చేయవచ్చని సూచించారు.

అద్దె బస్సులకు టెండర్ల ఆహ్వానం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు జిల్లాలోని ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు ఆర్టీసీ డిపోల నుంచి అద్దె బస్సులకి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. బిడ్డర్లు ఈ-కామర్స్ పోర్టల్ ఎంఎస్‌టీసీ 6సీ అడ్రస్‌లో టెండర్ దరఖాస్తులు పొందవచ్చని పేర్కొన్నారు. టెండర్లు ఈనెల 26న సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. జిల్లాలో ఎనిమిది రూట్లకు గాను ఏలూరు డిపో నుంచి భీమవరం అల్ట్రా పల్లెవెలుగు రెండు బస్సులు, జంగారెడ్డిగూడెం డిపో నుంచి ఏలూరుకు రెండు పల్లెవెలుగు బస్సులు, జంగారెడ్డిగూడెం డిపో నుంచి విజయవాడకు అల్ట్రా డీలక్స్ సర్వీస్, నూజివీడు డిపో నుంచి మచిలీపట్నంకు రెండు అల్ట్రా పల్లెవెలుగులు బస్సులు, నూజివీడు డిపో నుంచి ఖమ్మం మీదుగా హైదరాబాద్ జీడిమెట్ల ఒక సూపర్ లగ్జరీ బస్సు కోసం టెండర్లు ఆహ్వానిస్తున్నామని తెలిపారు.

కొత్త వంగడాలకు మారుపేరు.. మార్టేరు

2021, 2022లో కొత్త వరి వంగడాల సృష్టి

సాక్షి, భీమవరం: వరి పంటలో వినూత్న ప్రయోగాలకు మార్టేరు వ్యవసాయ పరిశోధనా కేంద్రం పేరు గాంచింది. కొత్త వంగడాల కోసం శాస్త్రవేత్తల కృషి ప్రశంసనీయం. వరి పంటలో ఎక్కువ దిగుబడి సాధించడమేగాక తెగుళ్లను తట్టుకునే వంగడాలను సృష్టిస్తున్నారు. దీనిలో భాగంగా 2021, 2022 సంవత్సరాల్లో మార్టేరు వ్యవసాయ పరిశోధనా కేంద్రం కొత్త వరి వంగడాల్ని విడుదల చేసింది.

- 2021లో ఎంటీయు 1212 రకాన్ని ఐఆర్ 64, పీఎల్‌ఏ 99-1-3-1-3 రకాల సంకరంగా రూపొందించారు. 140 రోజుల్లో కోతకు వచ్చే ఈ రకం అగ్గితెగులు, మెడ విరుపు తెగులు తట్టుకుని హెక్టారుకు సుమారు 7 టన్నుల దిగుబడి వస్తుంది.
- ఎంటీయూ 1280 రకం వంగడాన్ని ఎంటీయూ 1001, కేఎంపీ 150 రకాల సంకరంగా రూపొందించారు. 135 రోజుల్లో కోతకు వచ్చే ఈ రకం కాండం దృఢంగా, అగ్గితెగులు, ఆకుముడత తెగుళ్లను తట్టుకుంటుంది. హెక్టారుకు సుమారు 7 టన్నుల ధాన్యం దిగుబడి వస్తుంది.


మార్టేరు వరిపరిశోధనా కేంద్రంలో సృష్టించిన వరి వంగడం

- ఎంటీయూ 1281 రకం 140 రోజుల కాల పరిమితి వుంటుంది. కాండం దృఢంగా ఉంటుంది. గింజ మధ్యస్థంగా ఉండి అగ్గి తెగులు, సుడిదోమ తెగుళ్లను తట్టుకుంటుంది.
- గత ఏడాది విడుదల చేసిన రకాల్లో ఎంటీయూ రైస్ 1273 రకాన్ని బ్యాక్ క్రాస్ బ్రీడింగ్ పద్ధతిలో రూపొందించారు. ఇది 120 రోజుల్లో చేతికి వస్తుంది. గింజ రాలిక తక్కువగా ఉండడమేగాక అగ్గి తెగులును కొంతవరకు తట్టుకుంటుంది. ఈ రకం హెక్టారుకు సుమారు 6.5 టన్నుల వరకు దిగుబడి ఇస్తుంది.
- ఎంటీయూ 1293 రకం వరి 120 రోజుల్లో కోతకు వస్తుంది. సన్నటి గింజతో నాణ్యత కలిగి చౌడు భూముల్లో సాగుకు అనుకూలంగా ఉంటుంది. అగ్గి తెగులు, పొట్ట కుళ్లు తెగులు, టుంగ్రో వైరస్, ఆకుమచ్చ తెగుళ్లను కొంతవరకు తట్టుకుంటుంది. గింజ పొడవుగా సన్నగా ఉండి హెక్టారుకు 6 టన్నుల వరకు దిగుబడి వస్తుంది.
- ఎంటీయూ రైస్ 1310 రకాన్ని ఎంటీయూ 1075, సీఆర్ 3598-1-4-2-1 రకాల సంకరంగా రూపొందించారు. 135 నుంచి 140 రోజుల్లో కోతకు వస్తుంది. అగ్గి, మెడవిరుపు తెగుళ్లను కొంతవరకు తట్టుకునే 1310 రకం హెక్టారుకు 7.5 టన్నులు వరకు దిగుబడినిస్తుంది.
- ఎంటీయూ రైస్ 1318 రకంతో తక్కువ నత్రజనితో అధిక దిగుబడి పొందవచ్చును. పంట కాలం 150 రోజులు. రెండు వారాలపాటు నిద్రావస్థ కలిగి ఉండడంతో గింజ తొందరగా మొలకెత్తదు. కాండం దృఢంగా ఉండి చేనుపడిపోదు. గింజ మధ్యస్థ సన్నంగా పచ్చిబియ్యానికి అనుకూలం. అగ్గితెగులు, మెడవిరుపు, పొట్ట కుళ్లు తెగుళ్లను కొంతవరకు తట్టుకుని హెక్టారుకు 7.5 టన్నుల వరకు దిగుబడి ఇస్తుంది.
- ఎంటీయూ 1232 రకం అధిక దిగుబడినిచ్చే ముంపును తట్టుకునే రకం. పంటకాలం సాధారణ పరిస్థితుల్లో 135 నుంచి 145 రోజులు. నారుమడి నుంచి పిలకలు తొడిగే దశ వరకు సుమారు 10 రోజుల పాటు ముంపును తట్టుకుంటుంది. దోమపోటు, అగ్గితెగులు, మాగుడు తెగుళ్లను కొంతవరకు తట్టుకుంటుంది. సాధారణ పరిస్థితుల్లో హెక్టారుకు ఆరు టన్నుల వరకు దిగుబడి వస్తుంది.

అనువైన వంగడాలు ఎంచుకోవాలి



మార్టేరు వరి పరిశోధనా స్థానంలో పరిస్థితులకు అనుకూలంగా ఉండే వరి వంగడాలను రూపొందిస్తున్నాం. వాతావరణ పరిస్థితులకు అనువుగా తెగుళ్లను తట్టుకుని ఎక్కువ దిగుబడినిచ్చే వంగడాలు ఎన్నో రూపొందించాం. గత రెండేళ్లగా రూపొందిన రకాలు రైతులకు ఎంతో ప్రయోజనం కలిగాయి. రైతులు తమ భూములను బట్టి వరి వంగడాలను సాగుచేసుకుంటే మంచి దిగుబడులు సాధించవచ్చు.

– డాక్టర్ ఎంవీ కృష్ణాజీ, ప్రధాన శాస్త్రవేత్త(విస్తరణ), మార్టేరు

క్లుప్తంగా

రేషన్ బియ్యం సీజ్


జంగారెడ్డిగూడెంలో విజిలెన్స్ దాడుల్లో పట్టుకున్న రేషన్ బియ్యం వాహనం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో గురువారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ సీఐ విల్సన్ తెలిపిన వివరాల ప్రకారం.. జంగారెడ్డిగూడెంలోని మోక్ష రైస్ ట్రేడర్స్‌పై దాడులు నిర్వహించారు. ఏఎస్‌వో లక్ష్మణరావు, విజిలెన్స్ ఎస్సై నాగరాజుతో కలిసి వాహనాన్ని తనిఖీ చేయగా, వాహనంలో 3.5 టన్నుల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించామన్నారు. వాహన యజమానిని ప్రశ్నించగా, బుట్టాయగూడెం నుంచి ఈ బియ్యాన్ని తీసుకువచ్చానని, అక్కడ కిలో రూ.8కి కొనుగోలు చేసి, ఇక్కడ రూ. 15కి అమ్ముతున్నట్లు వాంగ్మూలం ఇచ్చాడని సీఐ తెలిపారు. దీంతో ఏఎస్‌వో, ఎస్సైలతో కలిసి రైస్ మిల్లులో తనిఖీ చేశామన్నారు. రైస్ మిల్లులో ఉన్న రూ.35 లక్షల విలువైన ధాన్యాన్ని సీజ్ చేసినట్లు చెప్పారు. పీడీఎస్ యాక్ట్ ప్రకారం రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేయడం నేరమని, సీజ్ చేసి, 6ఏ కేసుతోపాటు క్రిమినల్ కేసు నమోదు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

టైల్స్ పరిశ్రమలో అగ్నిప్రమాదం

ఉంగుటూరు: నారాయణపురం టైల్సు పరిశ్రమలో గురువారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. పరిశ్రమలోని ఓ ప్రాంతంలో గోనెసంచులు, చెత్తాచెదారం, జీడిపిక్కల వ్యర్థాలు నిల్వ ఉంచారు. వాటికి నిప్పంటుకుని మంటలు చెలరేగాయి. మంటలను కార్మికులు, భీమడోలు అగ్నిమాపక సిబ్బంది అదుపు చేశారు.

ప్రమాదాల నిలయంగా జాతీయ రహదారి

మరమ్మతుల సమయంలో నిర్లక్ష్యం వల్ల మరణాలు

తణుకు: జాతీయ రహదారి నిర్వహణ పేరుతో సిబ్బంది అవలంభిస్తున్న విధానాల వల్ల ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. తణుకు పట్టణ పరిధిలోని జాతీయ రహదారి అభివృద్ధి పనుల పేరుతో ఇటీవల మరమ్మతులు చేపట్టారు. అయితే గత కొన్నేళ్లగా మరమ్మతుల పేరుతో నిత్యం ట్రాఫిక్ మళ్లిస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. తద్వారా పలువురు వాహనదారులు మృత్యువాత పడుతుండగా పదుల సంఖ్యలో వాహనదారులు గాయాల పాలవుతున్నారు. మరోవైపు జాతీయ రహదారి నిర్వహణ పనులకు వినియోగిస్తున్న భారీ వాహనాలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. తాజాగా తణుకు మండలం దువ్వ జాతీయరహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో హైవే నిర్వహణ వాటర్ ట్యాంకర్ వాహనం ఢీకొని పదో తరగతి చదువుతున్న బాలిక మరణించింది. ఇలాగే గతంలో సైతం పలువురు మృత్యువాత పడ్డారు.


జాతీయ రహదారిపై నిత్యం కనిపించే ట్రాఫిక్ కోన్స్

నిత్యం ట్రాఫిక్ మళ్లింపే

పెనుగొండ మండలం సిద్ధాంతం నుంచి తాడేపల్లిగూడెం వరకు దాదాపు 50 కిలోమీటర్లు మేర జాతీయ రహదారి విస్తరించి ఉంది. జాతీయ రహదారి నిర్వహణ, మరమ్మతులు చేపట్టేందుకు దాదాపు రెండేళ్ల క్రితం ఒక కాంట్రాక్టు సంస్థకు అప్పగించారు. ఇందులో భాగంగా ఈ రోడ్డులో నిత్యం మరమ్మతులు చేస్తుండటంతో ట్రాఫిక్ మళ్లింపు చేపడుతున్నారు. దీంతో రోడ్డుకు మధ్య భాగంలో ట్రాఫిక్ కోన్స్ ఏర్పాటు చేస్తున్నారు. కిలోమీటర్ల మేర వీటిని ఏర్పాటు చేస్తుండటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మంగళవారం దువ్వలో జరిగిన ప్రమాదంలో రోడ్డు డివైడర్‌లో మొక్కలకు నీళ్లు పోసే వాటర్‌ట్యాంకర్ మోటారు సైకిల్ ను ఢీకొట్టడంతో బాలిక అక్కడిక్కడే మరణించింది. గతంలో డీమార్ట్ సమీపంలో సైతం మోటారు సైకిల్‌పై వెళ్తున్న మహిళ రోడ్డు డివైడర్‌పై పడి మృతి చెందారు. పెరవలి మండలానికి చెందిన మరో వ్యక్తిని హైవే నిర్వహణ వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఉండ్రాజవరం జంక్షన్ వద్ద సిగ్నల్ వద్ద వేచి ఉన్న యువకుల మోటారు సైకిల్‌ను వెనుక నుంచి వాహనం ఢీకొట్టిన ఘటనలో ఒక యువకుడు మృతి చెందాడు. ఇటీవల అలంపురం సెంటర్ వద్ద ట్రాఫిక్ మళ్లింపులో భాగంగా రోడ్డు దాటుతున్న మహిళను లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తణుకు పట్టణానికి చెందిన మహిళ మృతి చెందగా ఆమె కుమార్తెకు తీవ్ర గాయాలయ్యాయి. దువ్వ జాతీయ రహదారిపై డివైడర్ మధ్యలో గొయ్యిలో పడి ఒక యువకుడు మృతి చెందాడు.

నాసిరకం పనులు

జాతీయ రహదారి నిర్మాణ పనులు నాసిరకంగా చేపట్టడంతో నిత్యం మరమ్మతులకు గురవుతున్నాయి. మరోవైపు పగలు సమయాల్లో మాత్రమే మరమ్మతు పనులు చేపడుతూ రోడ్డు మళ్లింపు చేపట్టాల్సి ఉంది. అయితే జాతీయ రహదారి నిర్వహణ సిబ్బంది మాత్రం రాత్రి సమయాల్లో సైతం ట్రాఫిక్ కోన్స్ అలాగే వదిలేయడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఒక్కోసారి మరమ్మతు పనులు చేయపోయినప్పటికీ రోడ్డు మార్గం మళ్లిస్తుండటంతో సుదూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు జాతీయ రహదారి ఆనుకుని గ్రామాల ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా జాతీయ రహదారి నిర్వహణ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


కాల్వలో పడి మృతి చెందిన దుర్గాప్రసాద్

తణుకు: తణుకు మండలం వెంకట్రాయపురం గ్రామానికి చెందిన యువకుడు అనుమానాస్పద స్థితిలో కాల్వలో పడి మృతి చెందాడు. గ్రామానికి చెందిన వేల్పూరి దుర్గాప్రసాద్ (22) తాపీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. రాజమండ్రికి చెందిన ట్రాన్స్‌జెండర్ రెజీనాతో పరిచయం పెంచుకున్న దుర్గాప్రసాద్ గత కొన్నేళ్లుగా కలిసి మెలిసి ఉంటున్నాడు. ఇటీవల మండపాకలో జరిగిన యల్లారమ్మ జాతర ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామానికి వచ్చిన రెజీనాతో కలిసి ఈ నెల 4న రాత్రి మద్యం తాగాడు. మండపాక కాల్వ పక్కనే షెడ్డులో మద్యం తాగిన ఇద్దరూ అక్కడే నిద్రించారు. తెల్లారేసరికి దుర్గాప్రసాద్ ఆచూకీ లేకపోవడంతో తల్లి వేల్పూరి మహాలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దుర్గాప్రసాద్ మృతదేహాన్ని యర్రనీలిగుంట సమీపంలోని కాల్వలో గురువారం గుర్తించారు. ఈ ఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై కె.గుర్రయ్య తెలిపారు.

కొత్తపేటలో గల్ఫ్ ఏజెంట్ హత్య


మృతుడు పితాని రాంబాబు

పాలకొల్లు అర్బన్: మండలంలోని కొత్తపేటలో గురువారం తెల్లవారు జామున గల్ఫ్ ఏజెంట్ పితాని రాంబాబు అలియాస్ ఉంగరాల రాంబాబు(55) హత్యకు గురయ్యాడు. కుటుంబ తగాదాల నేపథ్యంలో భార్య విజయలక్ష్మి ఇనుప రాడ్‌తో తలపై మోదడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ కేసుకు సంబంధించి రూరల్ ఇన్‌చార్జ్ సీఐ డి.రాంబాబు, ఎస్సై కె.శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొత్తపేటకు చెందిన పితాని రాంబాబు(55) అలియాస్ ఉంగరాల రాంబాబు గల్ఫ్ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. రాంబాబు మొదటి భార్య వరలక్ష్మితో సుమారు 25 ఏళ్ల క్రితం విడాకులు తీసుకుని వేరుగా ఉంటున్నాడు. అనంతరం పెరవలికి చెందిన విజయలక్ష్మిని రెండో పెళ్లి చేసుకున్నాడు. వారికి ఇరువురు కుమారులుండగా.. పిల్లలను పట్టించుకోవడం లేదని భార్యాభర్తల మధ్య తరచూ ఘర్షణ జరుగుతోంది. గురువారం రాత్రి భార్యభర్తలు ఘర్షణపడ్డారు. ఈ ఘర్షణలో రాంబాబును విజయలక్ష్మి ఇనుపరాడ్‌తో తలపై మోదడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మొదటి భార్య వరలక్ష్మి కుమారుడు పితాని రమేష్ ఫిర్యాదు మేరకు విజయలక్ష్మి, ఆమె కుమారులు జగదీష్, నరేష్, మిత్రుడు జిలానిలపై రూరల్ ఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితురాలు విజయలక్ష్మిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలు

తణుకు: తణుకు పట్టణ పరిధిలోని జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డారు. ఉండ్రాజవరం మండలం కె.సావరం గ్రామానికి చెందిన తోట కృష్ణయ్య మోపెడ్‌పై తణుకు పట్టణానికి వచ్చే క్రమంలో జాతీయ రహదారిపైకి వచ్చారు. ఇదే సమయంలో తాడేపల్లిగూడెం వైపు నుంచి వచ్చిన వాహనం మోపెడ్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కృష్ణయ్యను చికిత్స నిమిత్తం 108 వాహనంపై తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బైక్ దొంగలకు 5 నెలల జైలు

ద్వారకాతిరుమల: గంజాయి కొనుగోలు కోసం బైక్ దొంగతనాలకు పాల్పడిన ముగ్గురు ముద్దాయిలకు 5 నెలల జైలు శిక్ష విధిస్తూ భీమడోలు కోర్టు న్యాయమూర్తి టీఎఎస్ఎస్ రామ ఆదిత్య రిషిక్ గురువారం తీర్పునిచ్చారు. ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్ తెలిపిన వివరాలు ప్రకారం.. అత్తిలికి చెందిన ముల్లేటి హరీష్, భీమవరానికి చెందిన కొండపల్లి హేమంత్, కట్టా కరుణ్ కుమార్‌లు గతేడాది పలు బైక్ దొంగతనాల కేసుల్లో ద్వారకాతిరుమల పోలీసులకు పట్టుబడ్డారు. దొంగిలించిన బైక్‌లను అమ్మగా వచ్చిన నగదుతో గంజాయి కొంటున్నట్టు దర్యాప్తులో తేలడంతో అప్పట్లో పోలీసులు వారిని అరెస్టు చేశారు. దీనిపై కోర్టులో వాదోపవాదాలు జరగగా, నేరం రుజువు కావడంతో ముగ్గురికి 5 నెలల సాధారణ జైలు శిక్షను విధించారు.

పరారీ కేసులో ఆరు నెలల జైలు

సాక్షి, భీమవరం: కోర్టుకు తీసుకొస్తున్న పోలీసు కానిస్టేబుల్‌ను గెంటేసి పరారైన కేసులో నిందితుడు పొన్నగంటి పవన్‌కుమార్‌కు ఆరు నెలలు జైలు శిక్ష విధించినట్లు భీమవరం వన్‌టౌన్ ఎస్సై ఎస్.సత్యసాయి గురువారం చెప్పారు. ఉండి గ్రామానికి చెందిన పవన్‌కుమార్‌పై పాలకోడేరు పోలీసు స్టేషన్ పరిధిలో రెండు గొలుసు దొంగతనాలు నమోదయ్యాయి. నిందితుడ్ని అరెస్టు చేసి భీమవరంలో కోర్టుకు తీసుకువస్తుండగా 2022 అక్టోబర్ 31న కానిస్టేబుల్‌ను గెంటేసి పరారయ్యాడు. దీనిపై ఎస్సై సత్యసాయి కేసు నమోదు చేసి పవన్‌కుమార్‌ను కోర్టులో హాజరుపరచగా భీమవరం రెండో అదనపు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ధనరాజు ఆరునెలలు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

నూజివీడు: ఆగిరిపల్లి మండలంలోని బొద్దనపల్లిలోని మామిడి తోటలో ఈ నెల 4న జరిగిన హత్య కేసులో ఇద్దరు నిందితులను ఆగిరిపల్లి పోలీసులు అరెస్టు చేశారు. వివరాలను నూజివీడు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్‌గౌడ్ తెలిపారు. కామవరపుకోట మండలంలోని జీలకర్రగూడెంకు చెందిన బోడపాటి నాగమణికి 2014లో ఎన్టీఆర్ జిల్లా మైలవరంకు చెందిన ఆంజనేయులుతో వివాహం జరగగా, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరి మధ్య మనస్పర్థలు వచ్చి విడిపోయారు. నాలుగేళ్ల క్రితం ఆగిరిపల్లి మండలం సీతారాంపురానికి చెందిన పాలకుర్తి గోపికి, నాగమణి మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయం తెలిసిన గోపీ భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. అనంతరం గోపీ, నాగమణిలు బతుకుదెరువు కోసం ఆగిరిపల్లి మండలం ఈదరలో కోళ్ల ఫాంలో పనిచేసుకుంటూ జీవిస్తున్నారు. ఆగిరిపల్లి మండలం బొద్దనపల్లికి చెందిన గోళ్ల కోటయ్య అలియాస్ కోటేశ్వరరావుతో నాగమణికి పరిచయం ఏర్పడి, వివాహేతర సంబంధానికి దారి తీసింది. దీంతో నాగమణి తన పిల్లలతో కలిసి కోటయ్య వద్దకు వచ్చి బొద్దనపల్లిలో ఉంటోంది. కొంతకాలం తరువాత నాగమణి మళ్లీ గోపీకి దగ్గరైంది. గోపీ దగ్గరకు వెళ్లిపోవాలని కోటేశ్వరరావుతో తరచూ గొడవపడేది. కోటేశ్వరరావు ఒప్పుకోకపోవడంతో పాలకుర్తి గోపి, నాగమణిలు ఈ నెల 4న బొద్దనపల్లి మామిడి తోటలో పాకలో నిద్రిస్తున్న కోటేశ్వరరావును గొడ్డలితో నరికి హత్య చేశారు. ఆ తర్వాత టీవీఎస్ మోపెడ్‌పై జీలకర్రగూడెం వెళ్తుండగా నూజివీడు మండలం యనమదల చెక్‌పోస్టు వద్ద గురువారం రూరల్ సీఐ ఆర్ అంకబాబు, ఆగిరిపల్లి ఎస్ఐ నంబూరి చంటిబాబులు వారిని అరెస్టు చేశారు. హత్యకు ఉపయోగించిన గొడ్డలిని, పారిపోవడానికి ఉపయోగించిన మోపెడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసులో చాకచక్యంగా వ్యవరించిన నూజివీడు రూరల్ సిఐ ఆర్ అంకబాబు, ఎస్ఐ నంబూరి చంటిబాబు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.


హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్‌గౌడ్

● గడపగడపకు సంక్షేమం


తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని దండగర్రలో గురువారం రాత్రి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

చిట్టీలు ఎగ్గొట్టిన వ్యక్తి అరెస్టు

గణపవరం: గణపవరం పరిసర గ్రామాలలో చిట్టీలు, అప్పుల పేరిట ప్రజల నెత్తిన రూ.3 కోట్లకు శఠగోపం పెట్టిన ప్రబుద్ధుడిని పోలీసులు గురువారం అరెస్టు చేశారు. గణపవరం గొల్లలదిబ్బ ప్రాంతానికి చెందిన ముదునూరి శ్రీనివాసరాజు కొంత కాలంగా గణపవరం పరిసర గ్రామాలలో చిట్టీలు వేస్తూ నమ్మకంగా వ్యాపారం చేస్తున్నాడు. కొంతకాలంగా చిట్టీలు పాడిన వారికి సొమ్ములు ఇవ్వడంలేదు. దీనితోపాటు పలువురి వద్ద వడ్డీలకు పెద్దమొత్తంలో అప్పులు తీసుకుని రాత్రికి రాత్రి పరారయ్యాడు. బాధితులు అతనికోసం గాలించినా ఫలితం లేకపోవడంతో గణపవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీనివాసరాజును గురువారం అరెస్టుచేసి తాడేపల్లిగూడెం కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్ఐ వేముల వెంకటేశ్వరరావు తెలిపారు.

నాటుసారా స్వాధీనం

కైకలూరు: మోటారు సైకిల్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తుల నుంచి 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశామని స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు బ్యూరో(సెబ్) కైకలూరు సీఐ ఎస్.రాంబాబు గురువారం చెప్పారు. కైకలూరు మండలం గోకర్ణపురం, శృంగవరప్పాడు గ్రామాల్లో తనిఖీలు చేస్తుండగా ఏలూరు మండలం ప్రత్తికోళ్లలంక గ్రామానికి చెందిన బలే దుర్గాప్రసాద్(21), ముంగర రామనందం(26)లను అదుపులోకి తీసుకుని, 10 లీటర్ల నాటుసారా, మోటారు సైకిల్‌ను సీజ్ చేశామన్నారు. కేసు నమోదు చేసి కైకలూరు కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 15 రోజులు రిమాండ్ విధించారని తెలిపారు. దాడుల్లో ఎస్ఐ జైనులాబ్దిన్, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవార్ల ఆలయాలను కదిలిస్తే ఊరుకోం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పశ్చిమగోదావరి జిల్లా అత్తిలి మండలం ఆరవల్లిలో గ్రామ దేవతల దేవాలయాలను తొలగించాలని ప్రయత్నిస్తే కోర్టు ధిక్కరణ నేరం కింద కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని నగరానికి చెందిన హైకోర్టు న్యాయవాది గొట్టుముక్కల రోనాల్డ్‌రాజు స్పష్టం చేశారు. ఆరవల్లిలో గ్రామ దేవతలైన కనకదుర్గమ్మ, మావూళ్లమ్మ, మహంకాళమ్మ, మారమ్మ, చెవులమ్మలకు అప్పటి ట్రస్టీలు 125 ఏళ్ల క్రితం మూడు దేవాలయాలను నిర్మించారని, ప్రతి ఏడాది ప్రజల రక్షణార్థం గ్రామ దేవతల ఆశీర్వాదం పొందటానికి పెద్దఎత్తున ఉత్సవాలు జరపటం సంప్రదాయంగా జరుగుతోందన్నారు. రోడ్లు వెడల్పు చేసే నెపంతో గ్రామ నడిబొడ్డులో ఉన్న గుడిని తొలగించే ప్రయత్నాలు ముమ్మరం చేస్తుండటంతో ట్రస్టీ కర్రి రామలక్ష్మి తనను సంప్రదించగా హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయగా, రెవెన్యూ, పంచాయతీ, పురావస్తు, దేవదాయశాఖ, ఆర్అండ్‌బీ శాఖల అధికారులకు హైకోర్టు నోటీసులు జారీ చేసిందన్నారు. దేవాలయాన్ని పడగొట్టే ఉద్దేశం గాని, అక్కడ నుంచి తరలించే ఉద్దేశం గాని ప్రభుత్వానికి లేదంటూ ఆర్ అండ్ బీ ఈఈ హామీపత్రాన్ని హైకోర్టుకు సమర్పించారని తెలిపారు. కొందరు నాయకులు వెనుకడుగు వేసినట్లే వేసి, తిరిగి తమకున్న రాజకీయ పలుకుబడితో అధికారులను తప్పుదోవ పట్టించి ప్రభుత్వం కోర్టుకు ఇచ్చిన హామీని కూడా తుంగలో తొక్కేవలా వ్యవహరిస్తున్నారని రామలక్ష్మి తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. దేవాలయాన్ని కూలగొట్టడానికి లేదా తరలించే ప్రయత్నం చేస్తే ఆర్అండ్‌బీ అధికారులపై కోర్టు ధిక్కరణ కింద చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరిస్తూ ఈ నెల 4వ తేదీన నోటీసులు జారీ చేశామన్నారు.

మధ్యాహ్నానికే నిర్మానుష్యం

- పెరుగుతున్న ఉష్ణోగ్రతతో ఆందోళన
- పగలు ఉక్కబోత, రాత్రి చలితో కలవరం



ప్రయాణికులు లేక వెలవెలబోతున్న ఏలూరు రోడ్డులోని బస్సులు ఆగే స్థలం



గూడెం పోలీస్ ఐలండ్ ప్రాంతంలో మధ్యాహ్నం 12 గంటలకే తగ్గిన రద్దీ

పెంటపాడు: ప్రస్తుతం పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో వేసవి అప్పుడే ప్రారంభమయ్యిందా.. అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే నడివేసవిలో ఎలా ఉంటాయోనని ప్రజలు కలవరపడుతున్నారు. పగలు ఎక్కువగా ఎండలు, రాత్రి సమయాల్లో శీతాకాలం ఛాయలతో కొద్దిగా చలివాతావరణంతో సతమతమవుతున్నారు. రోజులు గడిచే కొద్దీ అర్ధరాత్రి వరకు ఉక్కపోత ఉంటోంది. ఈ భిన్నమైన వాతావరణంలో దగ్గు, జలుబు, జ్వరం వంటి వ్యాధులు కూడా ఎక్కువౌతున్నాయి. కొందరు చర్మ సంబంధిత వ్యాధులైన దురద, మంట తదితర చమట పొక్కులతో బాధపడుతున్నారు. పౌడర్లు, క్రీంలు రాసుకొన్నా మరుసటిరోజు మామూలే. మధ్యాహ్నం 12 గంటల సమయానికి ఎండ తీవ్ర స్థాయిలో ఉండటంతో ప్రజల రాకపోకలు తగ్గుతూ రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. బస్సులు ఖాళీగా ఉండటం, ద్విచక్రవాహనాల సంఖ్య తగ్గడం , ముసుగులు వేసుకొని నడవడం వంటి దృశ్యాలు కనపడుతున్నాయి.

వచ్చేవారంనుంచి మరో 2 డిగ్రీలు పెరిగే అవకాశం

10 రోజులు క్రితం వరకు సుమారు 30 నుండి 32 డిగ్రీల మధ్య నమోదైన ఉష్ణోగ్రతలు నాలుగు రోజల నుంచి 34 నుండి 35 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. పగటి వాతావరణంలో సైతం వారం రోజులు క్రితం వరకు ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిలో ఉండగా నాలుగు రోజల నుంచి ఉదయం సమయంలో కూడా ఫ్యాన్లు వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రానున్న వారం రోజుల్లో రోజురోజుకూ ఎండలు పెరిగి ఉష్ణోగ్రతలు మరో రెండు డిగ్రీలు ఎక్కువగా నమోదు కానున్నాయని వాతావరణ నిపుణులు ఇప్పటికే ప్రకటించారు. రాబోయే వారంతో ఉష్ణాగతలు సుమారు 37 డిగ్రీలు గా నమోదు అవుతాయని, ఏప్రిల్ నెల ప్రారంభం నుంచి 39 నుండి 40 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

ఎండలు ముదురుతున్న నేపథ్యంలో పని నిమిత్తం బయటకు వెళ్లేవారు ఇప్పటి నుంచే జాగ్రత్తలు పాటించడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. దీనికి తోడు పదో తరగతి పరీక్షలు ప్రారంభం కావడంతో విద్యార్థులు కూడా ఆపసోపాలు పడుతున్నారు. ఎండలో పరీక్షలు రాస్తున్నారు. దీంతో పాటు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, తదితరులు జాగ్రత్తలు పాటించాలంటున్నారు. ఎండల్లో బయటకు తిరగాల్సిన వారు నీరు అధికంగా తీసుకోవాలని, రాగిజావ, కొబ్బరినీరు వంటి ద్రవాలు తరచూ తీసుకోవాలి. ఎండల్లో తిరగాల్సినవారు గొడుగులు, లేదా టోపీలు ధరిస్తే ఉష్ణోగ్రతల నుంచి కొద్దిగా రక్షణ కలుగుతుంది. ఆహారం సైతం కొద్దికొద్దిగా తరచూ తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



మినరల్ వాటర్ చలివేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని శ్రీకృష్ణ దేవరాయ సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక పోలీస్ ఐలాండ్ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. సేవా సంఘం గౌరవాధ్యక్షుడు, వ్యాపారవేత్త నంద్యాల కృష్ణమూర్తి చేతుల మీదుగా చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా ఈ చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సంఘం ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సేవా సంఘం అధ్యక్షుడు నిమ్మల వినాయక రావు, కార్యదర్శి జంగా శ్రీనివాస్‌రాం రాయ్, కోశాధికారి వట్టిపులును సత్యనారాయణ, గంధం వెంకట రాజశేఖర్, గార్లపాటి వీర కుమార్, పి.కుమార్‌స్వామి, బాకా వెంకటేశ్వరరావు, కోటేష్, వెంకట రమణ విశ్వేశ్వరరావులు పాల్గొన్నారు.

యల్లారమ్మకు విశిష్ట పూజలు



యల్లారమ్మకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలో చక్రరాజ సహిత శ్రీ యల్లారమ్మ అమ్మవారి వసంతోత్సవం, జాతర మహోత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు సందర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి విశిష్ట దర్శనం, సహస్రనామార్చనలు ఘనంగా నిర్వహించారు. మండపాకలో శ్రీ యల్లారమ్మ అమ్మవారి వసంతోత్సవం సందర్భంగా గ్రామంలో తీర్థం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ కన్వీనర్ బోడపాటి వీర్రాజు, ఆలయ కమిటీ ఛైర్మన్ పెండ్యాల మణికంఠ, ఆలయ కమిటీ సభ్యులు, ఈవో తదితరులు పాల్గొన్నారు.

కవి ప్రసాద్‌కు సాహితీ బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



కవి వీఎస్‌వీ ప్రసాద్

తణుకు: అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక సేవా సంస్థ శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో ఈనెల 9, 10 తేదీల్లో తిరుపతిలో నిర్వహించనున్న ప్రపంచ తెలుగు సాహిత బ్రహ్మోత్సవాలకు తణుకు పట్టణానికి చెందిన ప్రముఖ కవి వీఎస్‌వీ ప్రసాద్‌కు ఆహ్వానం అందింది. ఈ మేరక కళా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా హరిసర్వోత్తమ నాయుడు, అంతర్జాతీయ సమన్వయకర్త కొల్లి రమాదేవిల నుంచి ఆహ్వానం అందుకున్నట్లు కవి ప్రసాద్ తెలిపారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం



షటిల్ కోర్టును ప్రారంభిస్తున్న డీపీటీఓ ఎ.వీరయ్య చౌదరి

తాడేపల్లిగూడెం (టీఓసీ): క్రీడలతోనే మానసిక ఉల్లాసం సాధ్యపడుతుందని ఏపీఎస్ ఆర్టీసీ జిల్లా డీపీటీఓ ఎ.వీరయ్య చౌదరి అన్నారు. తాడేపల్లిగూడెం డిపో ఆవరణలో ఆర్టీసీ సిబ్బంది, డ్రైవర్లు, కండెక్టర్లు కోసం నూతనంగా ఏర్పాటు చేసిన షటిల్ కోర్టును డీపీటీఓ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఆరోగ్యంతో పాటు శారీరక ధృడత్వాన్ని పెంచుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి, ఎం.ఎఫ్ దివ్య, బాలసుబ్రహ్మణ్యం, టీఐ సురేష్, సెక్యూరిటీ సిబ్బంది పీవీరావు, రాంబాబు, వర్మ, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- దండగర్ర గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం



దండగర్ర గ్రామంలో గురువారం రాత్రి జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: రాష్ట్రాభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. గురువారం రాత్రి మండలంలోని దండగర్ర గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటి వరకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.2.07లక్షల కోట్లను ప్రజల ఖాతాలకు జమ చేయడం జరిగిందన్నారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చారన్నారు. రైతాంగానికి రూపాయి చెల్లించకుండా బీమా సదుపాయం కల్పించినట్లు తెలిపారు. పంట నష్టపోయిన అదే ఏడాది ఇన్‌పుట్ సబ్సిడీని అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వంలోనూ ఈ విధంగా జరగలేదన్నారు. జగన్ పాలనలో ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలం ఇచ్చామని తెలిపారు. రోడ్లను నిర్మించడం జరిగిందన్నారు. జగన్ పాలన ద్వారా రాష్ట్ర ప్రజల ఆలోచనా విధానంలో మార్పు కనిపిస్తుందన్నారు. గ్రామంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. రాజకీయ చైతన్యం కలిగిన గ్రామం దండగర్ర అని, గ్రామస్తులు మంచి ఆలోచన చేసి, మేలు చేసిన వారిని నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పొనుకుమాటి శేషులత, జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, సర్పంచ్ పిల్లా రాంబాబు, ఎంపీటీసీ వీరమళ్ల వెంకన్న, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ముప్పిడి పెద్దబ్బులు రెడ్డి, నాయకులు ముద్రగడ లలితకుమారి, యాతం సత్యనారాయణ, ములగాల గంగారావు, కొండుబోయిన కృపావరం, తహసీల్దార్ వైకేవీ.అప్పారావు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో వీఎస్.వేణుగోపాల్, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, ఏపీఎం జీవీకేడీఎం.లక్ష్మి, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతి ర్యాలీని విజయవంతం చేద్దాం



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): డా.బీఆర్. అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఈ నెల 14వ తేదీ శుక్రవారం పట్టణంలో భారీగా మోటార్ సైకిల్‌ర్యాలీ, ఆటోలతో ర్యాలీ నిర్వహించనున్నట్లు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు వెల్లడించారు. స్థానిక కడకట్లలో మంగరాజు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ జయంతి రోజున ర్యాలీతో పాటు వృద్ధులకు, పేదలకు చీరలు, అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. ర్యాలీ, సేవా కార్యక్రమాల్లో ప్రజా సంఘాలు, రాజకీయ నాయకులు, దళితులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించేందుకు సన్నద్ధం కావాలన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో సంక్షేమాలు, వివిధ పథకాలు ప్రజలందరికి అందుతున్నాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అద్దంకి ఆనంద్, నీటిపూడి వెంకటేశ్వరరావు, సబ్బితి రత్నరాజు, ఉప్పడి మోహన్‌రావు, యెన్నం చంటి, తాడేపల్లి చంటి, అద్దంకి సాల్మన్, ఎస్.కృష్ణారావు, చెవ్వాకుల మహేష్, బీరా త్రిమూర్తులు, కృష్ణమూర్తి, దాస్ పాల్గొన్నారు.

కోడిపందేలపై దాడి

పెంటపాడు: పెంటపాడు పోలీసులు గురువారం కోడిపందేలపై దాడులు నిర్వహించారు. దర్శిపర్రు శివారు పుంతలో పందేలు నిర్వహిస్తున్న వారిపై ఆకస్మికంగా సిబ్బందితో దాడులు చేసి 5 గురిని అరెస్టు చేశారు. వారి వద్ద ఉన్న రూ. 2,340 నగదును, పందేలు నిర్వహించే రెండు కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై జి. సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి.

గూడెంలో 13 నుంచి రక్షణ మహోత్సవాలు



49వ రక్షణ మహోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పాస్టర్ల సంఘ నాయకులు జ్యోతి ఆనంద్ తదితరులు

పెంటపాడు: గూడెంలో ఈనెల 13 నుండి మూడు రోజుల పాటు నిర్వహించబోయే రక్షణ మహోత్సవాలను విశ్వాసులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పాస్టర్ల సంఘ నాయకులు జీజే జ్యోతి ఆనంద్ పేర్కొన్నారు. గూడెం కొండాయి చెరువు వద్ద ఫెయిత్ చర్చిలో గురువారం యునైటెడ్ పాస్టర్స్ అసోషియేషన్ (యుపీఏ) సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిధిగా పాల్గొన్న జ్యోతిఆనంద్ మాట్లాడుతూ వరల్డ్‌వైడ్ ఫెయిత్ మిషన్ ఆఫ్ ఇండియా, గూడెం ఫెయిత్‌చర్చి 49వ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభలో ముఖ్య ప్రసంగీకులుగా బ్రదర్ అనిల్‌కుమార్ (హైదరాబాద్), పాస్టర్ బి. జాషువాజూడ్(తణుకు) గూడెంకు చెందిన రాష్ట్ర పాస్టర్ల సంఘ నాయకులు జీజే జ్యోతి ఆనంద్‌లు పాల్గొని దైవసందేశం అందిస్తారన్నారు. ప్రతీరోజూ సాయంత్రం 6 గంటల నుంచి నిర్వహించబోయే ఈ కార్యక్రమాన్ని పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

యుపీఏ నూతన కార్యవర్గం ఏర్పాటు

ఈ సమావేశంలో యునైటెడ్ పాస్టర్స్ అసోషియేషన్(యుపీఏ) రెండు ఏళ్లు పూరైన సందర్భంగా నియోజకవర్గ నూతన కార్యవర్గం ఏర్పాటు చేశారు. పెంటపాడు మండల అధ్యక్షుడిగా డీఆర్‌కే మోజస్, ప్రధాన కార్యదర్శిగా కె. కృపావరం, కోశాధికారిగా ఎం. ఐజక్‌రాజు గూడెం మండల యుపీఏ అధ్యక్షుడిగా ఫాధర్ పి. ఆనంద్‌బాబు, కార్యదర్శిగా కె. శామ్యూల్‌పాల్, కోశాధికారిగా టి. ఇశ్రాయేలు లను ఎన్నుకొన్నారు. నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడిగా జీజే జ్యోతి ఆనంద్ వ్యవహరించే ఈ సమావేశంలో నూతనంగా సేవకులు ప్రసన్నరాజు, బెన్నీపాల్‌లు నూతనంగా సభ్యత్వం పొందారన్నారు. ఆకివీడుకు చెందిన బిషఫ్ ఎం ప్రసాద్‌రాజు దేవుని వాక్యం అందించారు. యుపీఏ నియోజకవర్గ సంఘ సభ్యులు భారీ సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు

పెంటపాడు: నియోజకవర్గంలో పలు డినామినేషన్ చర్చిల్లో శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలు ఘనంగా జరగనున్నాయి. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు చర్చిల్లో విశ్వాసుల కోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. 40 దినాల క్రీస్తు శిలువ శ్రమల ఉపవాస ప్రార్థనలు నేటితో ముగియనున్నాయి. భస్మబుధవారం నుంచి నేటివరకు 40 దినాలు ప్రత్యేక ప్రార్థనలు చేసిన క్రైస్తవ భక్తులు తమ దీక్షను ముగిస్తారు. ఆర్సీఎం చర్చిల ఆధ్వర్యంలో గూడెం, పెంటపాడు, రూరల్ మండలాల్లో ర్యాలీలు చేపడుతున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలవరకు చర్చిల్లో జరగబోయే ప్రార్థనలకు టెంట్లు, కుర్చీలు వేసి సిద్ధం చేశారు. గూడెం ఎ క్లాస్ ఫ్యారిష్ లూథరన్ చర్చితో పాటు, పెంటపాడు, జట్లపాలెం, కడకట్ల, యానాలపల్లి, కె. పెంటపాడు గ్రామాల్లోని లూథరన్ చర్చిలు, ముదునూరుపాడు బైబిలు మిషను స్వస్థత శాల, రాచర్ల రూపాంత దేవాలయం, మథర్‌వన్నిని చర్చి, పాతూరు, బిళ్లగుంట, ప్రత్తిపాడు, తదితర ఆర్సీఎం చర్చిలు, ఆరుగొలను, చినతాడేపల్లి పలు గ్రామాల్లో ఉన్న బైబిలుమిషను చర్చిలు పలు గ్రామాల్లోని ఆయా సంఘాల చర్చిలు గుడ్‌ఫ్రైడే వేడుకలకు సిద్ధమయ్యాయి.

టౌన్ లూథరన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

పరిశుద్ధ వారాల ప్రార్థనల్లో భాగంగా నియమ గురువారం రాత్రి గూడెం టౌన్ ఎ.క్లాస్‌ఫ్యారిష్‌చర్చిలో గురుమండల అధ్యక్షుడు కె. విజయరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.ఈ సందర్భంగా గురుమండల అధ్యక్షుడు వాక్యం బోధించగా ప్రత్యేక ఆరాధన కార్యక్రమాన్ని సహాయ గురుమండల అధ్యక్షులు వి. రత్నావకర్ నిర్వహించారు. శిలువ శ్రమలను తలుస్తూ చర్చిసంఘ సభ్యులు ప్రత్యేక గీతాలు ఆలపించారు.

శ్రీ బలుసులమ్మ అమ్మవారి దేవస్థానము

దేవాదాయధర్మాదాయశాఖ, తాడేపల్లిగూడెం పట్టణము & మండలం ప.గో. జిల్లా

బహిరంగ వేలం ప్రకటన

[illegible]

క్ర.సం.	దేవస్థానము పేరు గ్రామము, మండలము	పాట పెట్టిన హక్కు	ధరావత్తు సొమ్ము	కౌలు కాలపరిమితి	పాట జరుగు ప్రదేశం తేదీ, సమయం
1.	శ్రీ బలుసులమ్మ అమ్మవారి దేవస్థానం తాడేపల్లిగూడెం గ్రామం & మండలం	[illegible]	10000	18.04.2023 నుండి 17.04.2024 వరకు	18.04.2023 [illegible] బలుసులమ్మ అమ్మవారి దేవస్థానం తాడేపల్లిగూడెం గ్రామం & మండలం
2.	శ్రీ బలుసులమ్మ అమ్మవారి దేవస్థానం తాడేపల్లిగూడెం గ్రామం & మండలం	[illegible]	5000	18.04.2023 నుండి 17.04.2024 వరకు	18.04.2023 [illegible] బలుసులమ్మ అమ్మవారి దేవస్థానం తాడేపల్లిగూడెం గ్రామం & మండలం

స్థలము : తాడేపల్లిగూడెం
తేది: [illegible]
కార్యనిర్వహణాధికారి

పదో తరగతి పరీక్షలు ప్రశాంతం

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో గురువారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. తాడేపల్లిగూడెం టౌన్, రూరల్ మండలం, పెంటపాడు పరిధిలో పదిహేడు ప్రభుత్వ, జెడ్పీ, మునిసిపల్, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలో హిందీ పరీక్ష జరగగా 3,379 మందికిగాను 3328 మంది హాజరైయారు. 51 మంది హాజరు కాలేదు.

ఇరగవరం: మండలంలోని పదోతరగతి హిందీ పరీక్షలు గురువారం ప్రశాంతం గా జరిగాయని మండల విద్యాశాఖ అధికారి ఎస్ శ్రీనివాస్ తెలిపారు. ఇరగవరం, తూర్పువిప్పర్రు, రేలంగి మూడు కేంద్రాలు ఉండగా మొత్తం 444 మంది విద్యార్థులు పరీక్ష కు హజరు కావలసి ఉండాగా 429 మంది విద్యార్థులు హజరయ్యాయరన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరీక్ష కేంద్రల వద్ద అన్ని ఏరాట్లు చేశామన్నారు.

మావుళ్లమ్మ ఆలయంలో చండీహోమం

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలోని శ్రీమావుళ్లమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం పౌర్ణమి సందర్భంగా చండీ హోమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ, ఆలయ వేద పండితులు కలిసి సంప్రదాయబద్ధంగా చండీ హోమం నిర్వహించారు. అలాగే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

కలిగొట్ల వంతెన పనులకు మోక్షం

ఉండి: కలిగొట్ల గ్రామస్తులను ఎప్పటి నుంచో వేధిస్తున్న వెంకయ్య వయ్యేరు కాలువపై వంతెన సమస్య డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు సహకారంతో పరిష్కారమైంది. వెంకయ్యవయ్యేరు కాలువపై క్రొవ్విడి గ్రామానికి రాకపోకల కొరకు గతంలో ఈ వంతెన నిర్మాణం ప్రారంభించినా అనివార్య కారణాల వల్ల నిర్మాణం నిలిచిపోయింది. అయితే గ్రామానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు పీవీఎల్ దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లడంతో వంతెన నిర్మాణానికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. గురువారం గ్రామంలో వంతెన నిర్మాణ పనుల పునఃప్రారంభిస్తూ పీవీఎల్ కొబ్బరికాయ కొట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎక్కడ సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరించేది జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనన్నారు. రైతులు, సామాన్యులు సమస్యలు ఎదుర్కొంటుంటే తమ దృష్టికి రాగానే వెంటనే వాటిని పరిష్కరించాలనేది ముఖ్యమంత్రి ఆదేశమన్నారు.

రైల్వే వారోత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం రైల్వే జంక్షన్ స్టేషన్‌లో గురువారం రైల్వే వారోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. రైల్వే శాఖ, శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ వానపల్లి చక్రవర్తి మాట్లాడుతూ ప్రజలకు, ప్రయాణికులకు రైల్వే వారోత్సవాలపై అవగాహన కల్పిస్తామని, కళాశాలల్లో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహిస్తామన్నారు.

ఈ-క్రాప్‌లో నమోదైన రైతుల నుంచే ధాన్యం కొనుగోళ్లు

ఆకివీడు: రైతు భరోసా కేంద్రాలలో ఈ-క్రాప్ నమోదు చేయించుకున్న రైతుల నుంచి మాత్రమే ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు సూచించారు. స్థానిక మండల పరిషత్ హాలులో గురువారం ధాన్యం కొనుగోలుపై కస్టోడియన్, ఆర్బీకే ఇన్‌చార్జిలు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, డీఈఓలకు శిక్షణా కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ అధికారులు నవీన్ కుమార్, మల్లమ్మ మాట్లాడుతూ ఆర్బీకేల్లో ఉన్న జాబితా ప్రకారమే ధాన్యం రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయాలని సూచించారు. తేమ శాతం 17కు మించకూడదని తెలిపారు. రైస్ మిల్లర్లు బ్యాంక్ గ్యారంటీలను తీసుకోవాలన్నారు. శిక్షణా కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీకర్, ఏఓ ప్రియాంక, ఏడీఏ కేఎస్ఎస్ శ్రీనివాసరావు, బ్యాంక్ మేనేజర్లు, సివిల్ సప్లయ్ అధికారులు పాల్గొన్నారు.

క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరం

భీమవరం(ప్రకాశం చౌక్): మహిళల్లో ఆరోగ్య సమస్యల గుర్తించేందుకు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తుండటం అభినందనీయమని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. పట్టణంలోని శ్రీకృష్ణ దేవరాయ కల్యాణ మండపంలో భీమవరం ఆబ్స్టెట్రిక్స్ గైనిక్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని కొయ్యే మోషేన్‌రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమవరంలో మహిళలకు క్యాన్సర్ పరీక్షల కోసం ఈ శిబిరం ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. డీఆర్వో కె.కృష్ణవేణి మాట్లాడుతూ మహిళలకు బ్రెస్ట్ క్యాన్సర్, సర్వేకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడం మంచి కార్యక్రమన్నారు. డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ డి.మహేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రజలు ఇటువంటి శిబిరాలను సద్వినియోగం చేసుకుని క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని కోరారు. డాక్టర్ పద్మావతి తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా వివేజ్ ఫౌండేషన్ సేవా సంస్థను ప్రారంభించారు. సంస్థ సెక్రటరీ డాక్టర్ జి.సుజియశ్రీ, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సుంకర నరసవాణి, డాక్టర్లు రమ్య, రామలక్ష్మి, కవిత, కృష్ణకుమారి, గ్రంధి వెంకట్రావు, గ్రంధి సురేష్, స్వప్న పాల్గొన్నారు.

హరికథ సప్తాహ మహోత్సవాలు ప్రారంభం

భీమవరం (ప్రకాశంచౌక్): అంతరించిపోతున్న ప్రాచీన కళలు పునరుద్ధరించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని, హరికథ పురాతన కళ అని ఆర్డీవో దాసి రాజు అన్నారు. భీమవరం త్యాగరాజ భవనంలో హరికథ సప్తాహ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. యండమూరి శిఖామణి (రామచంద్రపురం) నిర్వహించిన శ్రీరామ జననం హరికథ ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. అనంతరం ఆర్డీవోను సత్కరించారు. బొమ్మిడి నారాయణరావు, వబిలిశెట్టి కనకరాజు, చెరుకువాడ వెంకట్రామయ్య, రంగసాయి, కె.సుబ్బారావు, వబిలిశెట్టి శ్రీవెంకటేశ్వర్లు, కె.శిరీష, పోతయ్య, కొండ్రు శ్రీనివాస్ పాల్గొన్నారు.